సింగిల్ పేజీ కథ

# తనదాకా వస్తే

-సి. హెచ్. మధు.

"వాడు మినిస్టర్ కాగానే అందర్నీ మరిచిపోయాడు. ప్రజలను మరిచిపోయాడు. వీడిలా మారిపోతాడని ఎవరూ ఊహించలేదు"

పవన్‌కుమార్ గురించి వినయ్‌కుమార్ నిశ్చితాభిప్రాయమిది.

పవన్‌కుమార్ గురించి ప్రజలక్కూడా అదే అభిప్రాయముంది!

పవన్‌కుమార్ మంత్రి కాగానే ఎన్నోపనులు చేసి పెడ్తాడని అందరూ భావించారు.

కాని ఆయన శంఖుస్థాప నలకూ, సమావేశాలకూ, సభలకూ, సన్మానాలకూ మాత్రమే పరిమితమయ్యాడని ఆ తర్వాత గ్రహించారు.

పవన్‌కుమార్ అలా మారిపోవటం, ప్రజల కొరకు ఏ పనీ చేయకపోవటం వినయ్‌కుమార్‌కు చాలా కోపంగా ఉంది!

మంత్రి పవన్‌కుమార్‌కు జ్ఞానోదయం కలిగించాలని... ఆయన ఆ నియోజక వర్గానికి వస్తోన్న సందర్భంలో ప్రజలను సమీకరించి, పెరిగిన ధరలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించాలని అనుకుని దానిని ఆచరణలో పెట్టాడు వినయ్‌కుమార్.

"పవన్‌కుమార్ డౌన్‌డౌన్...మంత్రి డౌన్ డౌన్...ధరలు తగ్గాలి..." నినాదాలతో జనం మంత్రికారు కడ్డం పడ్డారు...

పవన్‌కుమార్ కార్లోంచి దిగలేదు కానీ అతడు వినయ్ కుమార్ నాయకత్వంలో జరుగుతోన్న నిరసన ప్రదర్శన గమనించాడు.

జరగాల్సింది జరిగింది. పోలీసులు అరెస్ట్ చేశారు.

మంత్రి పవన్‌కుమార్ గెస్ట్ హౌజ్ వెళ్ళగానే .

"అరెస్ట్ చేసిన వాళ్ళందర్నీ విడుదల చేయ"మని పోలీసుల్తో ఫోన్‌లో చెప్పాడు.

మంత్రి పవన్‌కుమార్ మర్నాడు సరాసరి వినయ్ కుమార్ ఇంటికెళ్ళాడు. వినయ్‌కుమార్‌ను పరామర్శించాడు. అరెస్ట్ చేసినందుకు క్షమాపణ కూడా చెప్పాడు.

వినయ్‌కుమార్ ముభావంగా, ముక్తసరిగా మాట్లాడాడు.



"నేను పనిచేయటం లేదని నీకు కోపంగా ఉంది కదూ! వారం రోజులు సమయమివ్వు" అంటూ తిరిగొచ్చాడు.

నాలుగు రోజుల తర్వాత వినయ్‌కుమార్‌ని జిల్లా పేద ప్రజానీకం అభివృద్ధి కమిటీ "ఛైర్మన్‌గా నియమిస్తూ నువ్వు పనిచేస్తావనీ - పనిచేయాలనీ నా ఆకాంక్ష" అంటూ లేఖ వ్రాశాడు.

తాను పదవి ఆశించి నిరసన తెలుపలేదు. కానీ పదవిచ్చారు, పనిచేసి తానేమిటో నలుగురికీ చూపించాలని అంగీకరించాడు వినయ్‌కుమార్.

వినయ్‌కుమార్ జిల్లా పేద ప్రజానీకం అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతల్ని స్వీకరించాడు.

అతడు ఎన్నో చేయాలనుకున్నాడు. ఎన్నెన్నో గ్రామాలు తిరిగాడు. పేదల కష్టాలూ, సమస్యలూ తెలుసుకొన్నాడు. వారి అభివృద్ధికి ఒక ప్రణాళిక తయారుచేసి జిల్లా కలెక్టర్‌కి ఇచ్చాడు.

జిల్లా కలెక్టర్ చెప్పాడు.

'బడ్జెట్ లేదు'

సంబంధిత శాఖామాత్యుల వద్ద తన ప్రణాళికనుంచి చర్చించాడు.

'బడ్జెట్ లేదు'

ఇంకా ఎందుకీ పదవి అనుకుని రాజీనామా వ్రాసి మిత్రుడు మంత్రి పవన్‌కుమార్ ముందుంచి!

"తుమ్మినా...దగ్గినా బంద్‌లు పాటించే దేశంలో... మనం మిగులు బడ్జెట్ చూసేదెప్పుడూ! ఇప్పటి నుండి నిన్ను నేనేమీ విమర్శించను" అంటూ లెంపలేసుకున్నాడు వినయ్‌కుమార్. ★